ఎదుటి వారిలో వున్న తప్పును గుర్తించే వాళ్ళున్నారు. లేనితప్పును వెతికేవాళ్ళూ వున్నారు. తను చేసిన తప్పును గుర్తించే వాళ్ళే అరుదుగా వుంటారు. అదే ఆశ్చర్యం!

# గుర్తానిశవం

నందం రామారావు



"నమస్కారమండి!"

సీరియస్‌గా నవల రాసుకుంటున్న సుచరిత తలెత్తి చూసింది ఆమె కెదురుగా పాతికేళ్ళ కుర్రాడు నుంచున్నాడు. ఆ కుర్రాడు అందంగా వున్నాడు. బలిష్ఠంగా వున్నాడు. సంతోషంగా వున్నాడు చూడ్డానికి. సినిమా ఫీల్డ్‌కి క్రొత్తగా వచ్చిన హీరోలా వున్నాడు!

తలెత్తిన సుచరిత రాసుకుంటూనే, చేత్తో కూర్చోమన్నట్టుగా సైగచేసింది.

ఈ సమయం ఆమెకు చాలా విలువైనది. విలువైనదేకాదు, లాభదాయకమైనది కూడాను!

ఆంధ్రదేశంలో సుచరితకు రచయిత్రిగా చాలా గొప్ప పేరుంది.

గొప్ప రచయిత్రిగా పేరు పొందడానికి అర్హత లేవిటని ప్రశ్నిస్తే- మనసు స్పందించి, సామాజిక స్పృహ కలిగి పాఠకుడ్ని ఆలోచింపజేసేవిగా వుండి, తక్కువ కథలు రాసి పేరు సంపాదించడం. కథల్లో వైవిధ్యం లేకపోయినా ఎక్కువగా రాయాలనే ఆరాటంతో రాస్తున్నామని అనిపించుకోవడం కోసం ఏదో రాసి పేరు సంపాదించడం!

ఈ లెక్కన సుచరిత చాలా ఎక్కువ సంఖ్యలో కథలూ, నవల[illegible] రాసింది!

దాదాపు పదిహేను నిమిషాలు గడచిన తర్వాత, వచ్చినకుర్రాడి ఓర్పును మనస్సులోనే అభినందించుకుని రాయడం ఆపి, కాయితాలను సర్దు[illegible]—

"మీరు నుంచునే వున్నారు? కూర్చోండి." అని అన్నది సుచరిత మందహాసం చేస్తూ. "నా పేరు రామారావండి. మీ కథలన్నా, మీ నవల్లన్నా నాకు చాలా యిష్టం. అన్ని పత్రికలూ కొంటాను."

"అలాగా...."

"మీరు మొన్న పత్రికలో రాసిన సీరియల్ చాలా గొప్పగా వుంది. ముగింపు అద్భుతంగా వుంది."

సుచరిత సుతారంగా నవ్వింది. నవ్వి రామారావుకేసి ఓరగా చూసింది.

"మీ పుస్తకాలుచదివినఇన్స్పిరేషన్‌తో నాకూ కథలు రాయాలనిపించిందండి. రాత్రికి రాత్రి ఒక కథ రాశాను. ఇది మీకు చూపించాలని తీసుకొచ్చాను."

"ఇలా యివ్వండి చదువుతాను."

రామారావ్ బాగ్‌లోంచి ఓ కథ తీసి సుచరిత కిచ్చాడు.

సుచరిత ఆ కథను అందుకుని పేజీలు తిప్పుతూ— "అబ్బో ఫస్టులోనే పెద్ద కథే రాశారు" అని అన్నది.

"అవునండి మీరు నన్ను ఎంకరేజ్

## మన వర్ధమాన క్రీడాకారులు 3

# కుమారి కె. రత్నకుమారి



మన గ్రామీణ ప్రాంతాల్లో సమర్ధవంతులైన క్రీడాకారులు వున్నారు. అవకాశం, ప్రోత్సాహం లభిస్తే వెలుగులోకి రాగలరని నిరూపించింది. మన రాష్ట్ర వెనుకబడిన తాలూకాలో ఒక కుగ్రామంలో జన్మించిన కుమారి కన్నెగంటి రత్నకుమారి 1962 నవంబర్ 10న చింతలపూడి తాలూకా ఎర్రగుంటపల్లె గ్రామంలో ఒక సామాన్య వ్యవసాయదారుని గృహంలో జన్మించిన ఈ చిన్నారి భారత జట్టుతో శ్రీలంక పర్యటించింది.

మొదటిసారిగా ఏలూరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ క్రీడోత్సవాలలో మొదటిసారిగా పాల్గొన్నది. సుమారు 150 మంది విద్యార్థులు కలిగిన ఎర్రగుంటపల్లె పాఠశాల విద్యార్థినిగా ఈమె బాలురను సహితం 'ఖో-ఖో' ఆటలో ఓడించగల సమర్థతను చూసిన ఆ పాఠశాల క్రీడోపాధ్యాయులు ఈమెను తీర్చిదిద్దితే తప్పక ప్రతిభావంతురాలైన క్రీడాకారిణిగా రాణించగలదని గుర్తించి, కష్టపడి శిక్షణ యిచ్చి పైకి తెచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా బాలికల ఖో-ఖో జట్టు అనేక విజయాలను సాధించింది. అందుకు కారణం రత్నకుమారి ప్రతిభ. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ "ఖో-ఖో" జట్టుతో ఆడి జాతీయ పోటీలలో రజత పతకములు రెండు వ్యాయామములు గెల్చుకొన్నది. జాతీయ జూనియర్ ఖో-ఖో పోటీలయందు ప్రప్రథమంగా ఆంధ్ర జట్టు రజత పతకం సాధించిన జట్టులో రత్న కూడా ఉన్నది. మీరట్‌లో జరిగిన పోటీలలో స్వర్ణపతకం గెల్చిన తెలుగు జట్టుకు ఈమె క్రీడా నైపుణ్యమే కారణం.

ఢిల్లీలో జరిగిన అఖిల భారత పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టులో ఆడి వెండి పతకం సాధించింది. ఇది ఎథ్లెటిక్ పోటీలలో. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పోటీలలో అనేక పతకములు సాధించింది. 800 మీ. 200 మీ పరుగు, లాంగ్‌జంప్‌లో ఈమె బంగారు పతకములు సాధించింది. గత సంవత్సరము శ్రీలంక అథ్లెటిక్ ఎసోసియేషన్ ఆహ్వానంపై శ్రీలంక పర్యటించిన మన జట్టులో ఈమె కూడా వుంది. 800 మీ పరుగులో వెండి పతకం కూడా సాధించింది. 800 మీటర్ల పరుగును ఈమె 2ని 44.2 సెలలో పరుగెత్తి మన రాష్ట్ర రికార్డును 19[illegible]5లో స్థాపించినది. దీన్ని నేటికి కూడా ఎవరూ అధిగమించలేరు. ఈమె ప్రతిభను గుర్తించి క్రీడలలో ప్రోత్సహించు నిమిత్తం గత నాలుగు సంవత్సరముల నుంచి కేంద్ర ప్రభుత్వం 'స్పోర్ట్స్ టాలెంట్ స్కాలర్‌షిప్' యిస్తున్నారు. ప్రస్తుతం చింతలపూడి జూనియర్ కాలేజిలో ఇంటర్మీడియెట్ చదువుతున్నది. ఈ ఏడు శ్రీనగర్‌లో జరిగిన 'వింటర్ గేమ్స్'లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంది కుమారి రత్న.

—మంకరమ్

---

చేస్తే ఇంకా రాయాలని వుంది. ఈ కథలో తప్పులుంటే దిద్ది, ఈ కథను మీ చేతుల మీదుగా ఒక రూపానికి తీసుకురావాలి."

"తప్పకుండా ఇంతకూ ఇది ఏ కథ?"

"మీరు చదువుతారుగా. కథ ముందే చెప్పాననుకోండి. టెంపో పోతుంది. అవునండీ! మీ అభిమానిగా అడుగుతున్నాను- ఇప్పుడు మీరు రాస్తున్నదేవిటో తెలుసుకోవచ్చా?"

"మంత్లీ వాళ్ళు ఒక నవల రాసివ్వమని అడ్వాన్సుగా రెండువేలిచ్చారు. వారికోసం ఈ నవల."

"అచ్చా! మరి నేను వెళ్ళొస్తానండి. ఇంత సేపూ మీకు...."

"నో. నో.... అదేంలేదు."

'మరి నన్ను ఎప్పుడు కలవమంటారు?'

"ఆదివారం ఉదయం కలవండి. సాయంత్రం మట్టుకు రాకండి. సారస్వత సమితిలో ఈనాటి సాహిత్యం మీద ఉపన్యాసం యివ్వాలి."

"అలాగేనండి. మీరు మట్టుకు నన్ను ప్రోత్సహించాలి."

"చూద్దాం" అన్నది సుచరిత.

రామారావ్, ఆమెకు వినయంగా నమస్కరించి వెళ్ళిపోయాడు.

* * *

"ఛీ! ఛీ! ఇటువంటి కథలు రాసి సాహిత్యాన్ని ఖూని చేసేస్తున్నారు" సుచరిత చాలా కోపంగానే పైకి అనుకుంది.

ఆ కథ చదివిన దగ్గరనుంచీ ఆమె మనస్సంతా కోపంతో కుతకుత లాడసాగింది. "అడ్డమైన వాళ్ళందరూ కథలు రాయాలని బయలుదేరడమే! తెలుగు సాహిత్యానికి చివర్రోజులొచ్చేశాయ్" అని.

మరోసారి రచయిత్రి అనుకుంది.

ఆమె ఏదో రాసుకోవాలని పెన్నూ, కాయితం తీస్తున్నంతలో—

"నమస్కారమండి. నేను రామారావుని" అంటూ రామారావు లోపలికి వచ్చాడు.

ఆ కాబోయే యువరచయితను చూస్తూనే సుచరిత కోపం తారాస్థాయికి చేరింది. ఐనా, ఆ కోపాన్ని కనిపించనీయకుండా—

"రండి" అంటూ కుర్చీ చూపించింది.

"మీరు నా కథను చదివారనుకుంటాను"

"ఆ చదివాను. మరేం అనుకోనంటే ఒక్కమాట."

"చెప్పండి"

"మీరు కథలు రాయడం మానేయండి. ఇటువంటి కథలు రాసి జనాన్ని చంపొద్దు."

"ఇప్పుడు దేశంలో జనాభా ఎలాగూ పెరుగుతోందిగదా? పోనీ, ఈ రకంగానైనా చస్తే మంచిదేగదా!" రామారావ్ చాలా స్పోర్టివ్‌గా అన్నాడు.

ఈ మాటకి రచయిత్రి నవ్వి—

"మీరు రచయిత కావాలనే ప్రయత్నం చెయ్యడం కంటే, మరో వ్యాపకం ఏదైనా పెట్టుకోవడం మంచిది" అని అన్నది.

"అంతేనంటారా?"

"లేకపోతే ఎందుకండి ఇటువంటి కథలను అసలు ఏ పత్రికా వేసుకోదు"

"అయితే ఈ కథ ఏ పత్రికలోనూ పడదంటారా?"

"ముమ్మాటికీ పడదు"

సుచరిత అన్న ఈ మాటకు రామారావు పకపకా నవ్వేశాడు.

'పిచ్చోడు! రాసిన కథ పడదంటే అలా నవ్వుతాడేవిటి?' అని అనుకుంది మనస్సులో సుచరిత.

రామారావు ఇంకా నవ్వుతూనే వున్నాడు.

"ఎందుకలా నవ్వుతారు?"

"సారీ మేడమ్! నేను తీసుకొచ్చిన ఈ కథలు లోగడ మీరే పత్రికల్లో రాశారు. మీరు రాసిన కథను ఫెయిర్ చేసి, తీసుకొచ్చి మీకిస్తే, మీరు రాసిన కథను మీరే గుర్తించలేకపోయారు! మీరెంత చెత్త కథలు రాస్తున్నారో గ్రహించారుగదా! ఇకనుంచైనా మీరు కథలు రాయడం మానేస్తే సాహిత్యానికి, జనానికీ చాలా మంచిది. వస్తానండి."